VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 20 సెప్టెంబర్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 62

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో..

# హైదరాబాద్‌కు ఎక్కడలేని ఘన చరిత్ర



**తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి**

**పెట్టుబడులను సాదరంగా ఆహ్వానిస్తున్నాం**

**భవిష్యత్తు తరాలకు అవకాశాలు సృష్టించండి**

**2027 నాటికి ఎలక్ట్రికల్ వాహనాలే ఎక్కువ : సీఎం రేవంత్‌రెడ్డి**

**సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు అసాధ్యం**

**కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదు**

**ఎమ్మెల్యేల వ్యవహారంపై స్పీకర్‌దే తుది నిర్ణయం**

**కెసిఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలకు కవిత బలి**

**కాళేశ్వరంపై సిబిఐ విచారణలో కిషన్ రెడ్డి మోకాలడ్డు**

**మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**

**సిఎంతో భేటీ అయిన న్యూజెర్సీ గవర్నర్**



## అవినీతికి పాల్పడితే ఉపేక్షించం

హైదరాబాద్: పేదల సొంతింటి కలను నెరవేర్చే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, చెల్లింపుల విషయంలో అవినీతికి పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యల పరిష్కారం, సందేహాల నివృత్తికి గత వారం హౌసింగ్ కార్పొరేషన్‌లో ప్రారంభించిన కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులను లంచం అడిగే ఇందిరమ్మ కమిటీ సభ్యులను తక్షణం తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఖమ్మం, జగిత్యాల, కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇళ్లు మంజూరుకాని నలుగురికి వారి ఖాతాలో నిధులు జమచేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు నలుగురిని తక్షణమే సస్పెండ్ చేసి, పూర్తిస్థాయి విచారణ జరిపించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.సూర్యాపేట జిల్లా పోలుమల్ల, జనగామ జిల్లా పడమటితండాల్లో లబ్ధిదారుల నుంచి లంచం డిమాండ్ చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు, గ్రామ పంచాయతీ కార్యదర్శిపై విచారణ జరిపి 24 గంటల్లో నివేదిక ఇవ్వాలన్నారు. ఎవరైనా లంచమడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 5991కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణ దశలను బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిధులు మంజూరు చేస్తున్నామని.. అయితే బ్యాంకులు ఈ నిధులను లబ్ధిదారుల ఖాతాలో వేసి, పాత బకాయి కింద జమ చేసుకుంటే సహించేది లేదన్నారు. దీనిపై రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి లేఖ రాయాలని హౌసింగ్ ఎండీని మంత్రి ఆదేశించారు. చెల్లింపుల్లో ఎదురవుతున్న సమస్యలను దసరా పండగలోపు పరిష్కరించాలన్నారు. ఏఈలు ప్రతి గ్రామంలో లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఆధార్, బ్యాంకు వివరాలను పరిశీలించాలన్నారు. లబ్ధిదారులు కూడా బ్యాంకులకు వెళ్లి ఆధార్‌తో బ్యాంకుఖాతాలను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల కోసం ప్రత్యేక యాప్‌ను తయారు చేశామని.. ఒకట్రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు.


2లో..

## ఇందిరా మహిళా శక్తి ద్వారా పేదరిక నిర్మూలన

**రాష్ట్ర అభివృద్ధిలో మహిళలకు భాగస్వామ్యం**

**మహిళా శక్తి బజార్‌లో సరస్ మేళాను ప్రారంభించిన సీతక్క**


2లో..

## అరచేతిలో వైకుంఠం చూపించి..

**ఇప్పుడు చుక్కలు చూపిస్తున్నారు**

**మళ్లీ కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట ముంచుతారు**

**అభివృద్ధి అంటే బీఆర్ఎస్ :మాజీ మంత్రి కేటీఆర్**



## యూరియా కోసం బారులు.. రైతుల మధ్య తోపులాట

కారేపల్లి: ఖమ్మం జిల్లా కారేపల్లిలో యూరియా కోసం వేలసంఖ్యలో రైతులు బారులు తీరారు. ఐదు రోజులుగా యూరియా సరఫరా లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. లారీ లోడు యూరియా వస్తున్న నేపథ్యంలో ముందస్తుగా రైతులకు అధికారులు కూపన్లు ఇచ్చే ప్రక్రియ చేపట్టారు. దీంతో కారేపల్లి మండలంలోని 41 పంచాయతీల నుంచి 3వేలకు

పైగా రైతులు కూపన్ల కోసం క్యూలైన్లలో నిలుచున్నారు. ఈ క్రమంలో పలుమార్లు తోపులాట చోటుచేసుకుంది.

రైతులకు సర్దిచెప్పేందుకు పోలీసులు ఇబ్బందులు పడ్డారు.



## అభివృద్ధి పనులపై వారంలోగా ప్రతిపాదనలు

హైదరాబాద్: అభివృద్ధి పనులకు తక్షణం నిధులు విడుదల చేయాల్సిన ప్రతిపాదనలను ప్రాధాన్యక్రమంలో జాబితాల వారీగా అన్ని శాఖల ప్రధాన కార్యదర్శులు వారంలోగా అందజేయాలని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. రాష్ట్ర మౌలిక సదుపాయాలు, మూలధన పెట్టుబడులపై ఏర్పాటైన ఉపసంఘం శుక్రవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశమైంది. ఉపసంఘం సభ్యులు, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు పాల్గొన్నారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా పలు పనులను ప్రారంభించిందని, వాటిని శాఖల వారీగా ప్రాధాన్యక్రమంలో విభజించాలని ఉపసంఘం సూచించింది. నిధుల లభ్యత ఆధారంగా 1:3 నిష్పత్తిలో ప్రతిపాదనలు తీసుకురావాలని మంత్రులు సూచించారు.ప్రతిపాదనల సంఖ్య ఎక్కువగా ఉంటే సంవత్సరాల వారీగా ప్రాధాన్యక్రమంలో విభజన చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. ఏయే శాఖలో ఏయే పనులు పెండింగ్‌లో ఉన్నాయి, వాటికి ఇప్పటివరకూ చేసిన ఖర్చెంత, విడుదలైన నిధులెన్ని, ఇంకా ఎంత అవసరం.. అనే వివరాలపై మంత్రులు సమీక్షించారు. పలు పనులను గతంలో ఆర్థికశాఖ నుంచి నిధులు విడుదల కాకుండానే ప్రారంభించడంతో వాటికి ఇప్పుడు నిధుల విడుదల సమస్యగా మారిందని గుర్తించారు. ఇకముందు చేపట్టే పనుల ప్రాధాన్యం ముందే గుర్తించాలని, ఎక్కువ ప్రజా ప్రయోజనమున్న వాటిని తొలుత చేపట్టాలని మంత్రులు సూచించారు. హ్యామ్ రోడ్ల పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.



4లో..

## మహోన్నత శిల్పులు "ఉపాధ్యాయులు"

## తాత్కాలిక సాయుధ పోరాట విరమణ పార్టీ నిర్ణయం కాదు



హైదరాబాద్: శాంతిచర్చల పేరిట మావోయిస్టు పార్టీ నుంచి లేఖల పరంపర కొనసాగుతోంది. నిన్నటి వరకు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి మల్లోజుల వేణుగోపాల్‌రావు ఎలియాస్ అభయ్ ఎలియాస్ సోనూ పేరిట లేఖలు విడుదల కాగా.. తాజాగా శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట వెలువడింది. అయితే వీరిద్దరి ప్రకటనలు పరస్పర విరుద్ధంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. సాయుధ పోరాటానికి తాత్కాలికంగా విరామం ప్రకటించి శాంతిచర్చలకు సిద్ధంగా ఉన్నామని అభయ్ చెప్పగా.. అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని జగన్ పేర్కొనడం కలకలం రేపింది. ఇది పార్టీ అధికారిక ప్రకటన కాదని చెబుతూనే.. భాజపా ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలను తీవ్రతరం చేయాలని జగన్ పిలుపునిచ్చారు. దీన్నిబట్టి ఆయుధాలను వీడే విషయంలో పార్టీ అగ్రనేతల మధ్య భిన్నాభిప్రాయాలున్నట్లు వాదన వినిపిస్తోంది. 'విప్లవోద్యమ నిర్మూలనకు భాజపా ఎప్పటి నుంచో కగార్ పేరుతో భారీస్థాయి యుద్ధ చర్యలు కొనసాగిస్తోంది. ఈ ఏడాది మార్చిలో కొందరు ప్రజాస్వామికవాదులు శాంతికమిటీగా ఏర్పడి ప్రభుత్వానికి, మావోయిస్టు పార్టీకి మధ్య శాంతిచర్చల ప్రతిపాదన చేశారు. దీనికి జవాబుగా కూంబింగ్‌లు, కొత్త క్యాంపుల నిర్మాణాల్ని నిలిపివేసి శాంతియుత వాతావరణంలో చర్చలు జరపాలని మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రకటించింది. కానీ కేంద్రం ఎలాంటి సడలింపులు ఇవ్వకుండా యుద్ధచర్యలను కొనసాగిస్తూనే ఉంది. హోంమంత్రి బాహాటంగానే 2026 మార్చి నాటికి మావోయిస్టు పార్టీని నిర్మూలిస్తామని ప్రకటిస్తున్నారు. చర్చించేది లేదని.. ఆయుధాలు విడిచి లొంగిపోవాలని భాజపా నేతలు పదేపదే చెబుతున్నారు. ఈ క్రమంలో మే 21న పార్టీ ప్రధాన కార్యదర్శి ఉన్న బృందంపై దాడి చేయడంతో 28 మంది మరణించారు. జూన్ నుంచి సెప్టెంబరు మధ్య కూడా పలువురు కేంద్ర, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు మృతిచెందారు. ఇలా హత్యాకాండ కొనసాగుతుండగా నెల రోజులు సమయం ఇవ్వాలని అడగడం అనాలోచితం.

# అంతర్జాతీయంగా న్యాయశాస్త్ర పాత్ర ప్రతిష్టాత్మకమైనది.



- టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్. ఎం. యాదగిరి.



**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, సెప్టెంబర్ 19:**

అంతర్జాతీయంగాu న్యాయశాస్త్ర పాత్ర ప్రతిష్టాత్మకమైనదనీ టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ లా కాలేజీలో యునైటెడ్ స్టేట్స్ ఇమ్మిగ్రేషన్ సిస్టం అండ్ ప్రైవేట్ ఇంటర్నేషనల్ లా అనే అంశంపై విస్తృత ఉపన్యాసాన్ని డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏం. యాదగిరి మాట్లాడుతూ, గ్రామీణ స్థాయినుండి విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలతో మహోన్నతంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాన వక్తలు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ఉత్తం లు గ్రామీణ స్థాయి నుండి జీవితాన్ని ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మన అందరికీ గొప్ప ప్రేరణగా నిలిచిందన్నారు. ఈ స్ఫూర్తితో తెలంగాణ విశ్వవిద్యాలయ విద్యార్థులు మహోన్నతంగా ఎదగాలన్నారు. న్యాయ శాస్త్రానికి అంతర్జాతీయంగా గొప్ప గుర్తింపు ఉందని గుర్తు చేశారు.ప్రధాన వక్తగా డా శ్రీనివాస్ రావు కావేటి, సోలిసిటర్ ఇంగ్లాండ్ మరియు వాల్స్ (న్యూ యర్క్, యునైటెడ్ స్టేట్స్) హాజరై విస్తృతంగా ఉపన్యసించారు.
అంతర్జాతీయంగా భారతీయులకు న్యాయవిభాగంలో గొప్ప గుర్తింపు ఉందన్నారు. ఇటీవల అంతర్జాతీయంగా సాఫ్ట్వేర్ రంగంలో అత్యధిక విడాకులు జరుగుతున్నాయన్నారు. అన్ని రకాల వృత్తుల వారు అంతర్జాతీయంగా వలస వెళుతున్నారన్నారు. వలసల కారణంగా అనేక వివాదాలు తలెత్తుతున్నాయి అన్నారు. వాటిని పరిష్కరించడానికి న్యాయ శాస్త్ర అవగాహన
విస్తృతంగా ఉండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా రూల్ ఆఫ్ లా అమలు జరగడం లేదన్నారు. గ్లోబల్ ఇఆర్టి సొల్యూషన్స్ డైరెక్టర్ డా. ఉత్తం మాట్లాడుతూ, అంతర్జాతీయంగా అనేకమందికి ప్లేస్మెంట్ అవకాశం ఉందన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయాల విద్యార్థులు కూడా ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న రాణి, హెడ్ అండ్ ప్రిన్సిపల్, డాక్టర్ బి. స్రవంతి, బిఓఎస్, డాక్టర్ ఎం. నాగజ్యోతి, లా ఫ్యాకల్టీ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందికి మోమోలు ఇవ్వాలి.

- మున్సిపల్ కమిషనర్ కు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశం.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, సెప్టెంబర్ 19 :**



పారిశుద్ధ్య కార్యక్రమాలలో నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ సిబ్బందికి మెమోలు జారీ చేయవలసిందిగా మున్సిపల్ కమిషనర్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం కామారెడ్డి మున్సిపాలిటీలోని 15 వ వార్డులో గల వినాయక నగర్ లో అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలు మొదలగు వాటిని అత్యవసరంగా పునరుద్ధరణకు ఎస్డిఆర్ఎఫ్ క్రింద మంజూరు ఇచ్చిన పనులను వెంటనే పూర్తి చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించని కారణంగా సీరియస్ గా పరిగణించి వెంటనే సంబంధిత ఏరియా సానిటరీ జవాన్ మరియు ఇన్స్పెక్టర్లకు 24 గంటలలో సమాధానం తెలియ జేయుటకు షో కాజ్ నోటీస్ జారీ చేయవలసిందిగా మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీర్, వర్క్ ఇన్స్పెక్టర్లు, శాంటె ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాను విద్యారంగంలో ఉన్నత స్థాయిలో నిలపాలి.





**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**ఘనంగా బోధనాభ్యాసన సామాగ్రి మేళా.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, సెప్టెంబర్ 19**

జిల్లాను విద్యారంగంలో ఉన్నత స్థాయిలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఉపాధ్యాయులను సూచించారు. శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ బోధనాభ్యాసన సామాగ్రి మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, మేళాను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి 250 మంది ఉపాధ్యాయులు బోధనాభ్యాసన సామాగ్రిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతికతకు తగ్గట్టుగా విద్యార్థులలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని అన్నారు. ప్రాథమిక స్థాయిలో పునాది బలంగా ఉంటేనే ఉన్నత విద్యలో రాణించగలుగుతారని అన్నారు. పిల్లలకు తరగతి గదిలో అభ్యసన సామగ్రి తప్పనిసరిగా వినియోగించి విద్యా పట్ల ఆకర్షితులను చేయాలని అన్నారు. విద్యార్థులు వినడం కంటే నమూనాలను ప్రత్యక్షంగా చూడడం ద్వారా అధికంగా నేర్చుకోగలుగుతారని అన్నారు. చక్కటి ప్రదర్శనలను చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందిస్తు,
పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్తలు వేణుగోపాల్, నాగవేందర్, రమణరావు, పరీక్షల కమీషనర్ బలరాం, డీసీఈబీ కార్యదర్శి లింగం, ఎంఈవో లు ఎల్లయ్య, ఆనందరావు, రాజులు, యూసఫ్, రామస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పంటనష్టం అంచనా వేసి, పరిహారం ఇవ్వాలి.

- మాజీ ఎమ్మెల్యే షిండే జిల్లా కలెక్టర్ కు విన్నపం.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి:**





జుక్కల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ని మర్యాద పూర్వకంగ కలిశారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజక వర్గంలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా, వరదల వల్ల దెబ్బతిన్న పంటలను అంచనావేసి పంట నష్టం అదే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ను మర్యాద పూర్వకంగా కలిసి జుక్కల్ నియోజక వర్గంలోని పరిస్థితుల గురించి చర్చించారు.

# స్త్రీనిధి రాష్ట్ర బోర్డు కోశాధికారిగా స్రవంతి.



**అభినందించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**
**బీబీపేట మండల సమాఖ్య అధ్యక్షురాలు నుండి సదాల స్రవంతి రాష్ట్ర స్థాయికి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి**

: స్త్రీనిధి రాష్ట్ర బోర్డు కోశాధికారిగా సదాల స్రవంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీబీపేట మండల సమాఖ్య అధ్యక్షురాలు నుండి సదాల స్రవంతి రాష్ట్ర స్థాయికి ఎదగటం పట్ల పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ను మర్యాదపూర్వకంగా స్రవంతి కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా నుండి రాష్ట్ర స్థాయి పదవికి ఎంపికైనందుకు అభినందించి, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేలా రాష్ట్రస్థాయిలో రాణించాలని సూచించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పుష్ప రాణి, అడిషనల్ డిఆర్డిఓ విజయలక్ష్మి, స్త్రీ నిధి ఆర్ఎం కిరణ్ ఉన్నారు.

**ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ,**

రాష్ట్రస్థాయిలో తీసుకునే ప్లాన్లు అన్ని జిల్లాలో అమలుపరుస్తానని, జిల్లాని ముందు స్థాయిలో ఉంచడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సంవత్సరంకు గాను రూ" 95 కోట్ల ప్లాన్ కి 40 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందని అన్నారు. మిగిలిన బ్యాలెన్స్ రూ" 55 కోట్లు కూడా ఫిబ్రవరి లోపు కంప్లీట్ చేసేటట్టు చూస్తామని, అదే విధంగా రికవరీ కూడా ఇంప్రూవ్ అయ్యేటట్టు చూస్తామని అన్నారు.

# మాణిక్ భవన్ పాఠశాల అభివృద్ధికి కృషి.





- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

మాణిక్ భవన్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షంలో భాగంగా భారతీయ జనతా పార్టీ మండల ప్రధానకార్యదర్శి తెరల శ్రీధర్ గుప్తా మాణిక్ భవన్ పాఠశాలలో నిర్వహించిన పుస్తకాల పంపిణి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు, చాయ్ అమ్ముకునే స్థాయి నుండి దేశప్రధానిగా ఎదిగి భారతదేశన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న మోదీని భావి తరాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆడబిడ్డ పుట్టిననాటి నుండి విద్య, వైద్యం, పెళ్లి చేసుకునేవరకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు.అందులో భాగంగా బేటీ బచావో బేటీ పడవో, సుకన్య సమృద్ధి యోజన, పోషణ మహా వంటి పథకాలను తీసుకురావడం జరిగిందన్నారు.అగ్రవర్ణ పేద విద్యార్థుల కోసం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ 10శాతం తీసుకొచ్చి విద్య, ఉపాధిలో అవకాశాలు కల్పించడం చరిత్రత్మక నిర్ణయం అన్నారు. అగ్రవర్ణ పేద కుటుంబాలు అన్ని బిజెపి ప్రభుత్వానికి రుణపడి ఉన్నారని తెలిపారు. మాణిక్ భవన్ పాఠశాలను రాష్ట్రంలో ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. విద్యార్థులకు మౌలిక సౌకర్యాలతో పాటు అన్ని వసతుల ఏర్పాటుకు సహకరిస్తానని తెలిపారు.
వినయం, విధేయత, విద్యకు మారుపేరుగా ప్రఖ్యాతలు కలిగిన మాణిక్ భవన్ పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం 800 నోట్ పుస్తకాలు, పెన్నులను విద్యార్థులకు ఎమ్మెల్యే గారు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య పట్టణ సంఘం అధ్యక్షులు ధన్ పాల్ శ్రీనివాస్, మాణిక్ భవన్ పాఠశాల అధ్యక్షులు ఇంగు శివ ప్రసాద్, పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి ఇల్లందుల ప్రభాకర్, క్యాషియర్ గాలి నాగరాజు, ఆర్య వైశ్య సంఘ సభ్యులు మాణిక్ భవన్ పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన బీడీ కార్మికుల పోరాటం.

- సమస్యల పరిష్కారంకు లంగర్ బీడీ కంపెనీ అంగీకారం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



గత పది రోజులుగా సిద్ధిపేట లంగర్ బీడీ కంపెనీ కార్మికులు చేసిన పోరాటం ఫలించింది. కంపెనీ యాజమాన్యం, బహుళ జన బీడీ కార్మిక సంఘం మధ్య శుక్రవారం చర్చలు జరిగాయి. సిద్ధిపేట ప్రాంతలో గల కలకుంట్ల, నారాయణ రావు పేట బ్రాంచ్ టేకేదార్ లు పొరపాట్లు చేయడం మూలంగా, ఈ రెండు బ్రాంచ్ లను కంపెనీ స్వాదినం చేసుకుంది. వారికి నచ్చిన టేకేదార్ కు ఇవ్వడానికి పూనుకుంది, కానీ కార్మికులు పాత టేకేదార్ లకే ఈ బ్రాంచ్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గత 10 రోజులుగా పని బంద్ చేసి ఆందోళన చేపట్టారు. చివరకు యాజమాన్యం దిగివచ్చి కార్మికుల కోరిక మేరకు పాత టేకేదార్లకే ఇవ్వడానికి ఒప్పుకుంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల కంపెనీ హెడ్ ఆఫీసులో జరిగిన చర్చల్లో కంపెనీ జనరల్ మేనేజర్ ఉమకాంత్, సత్య పాల్, ప్రితేష్ బాయి, తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిద్దిరాములు, కార్మికులు పాల్గొన్నారు.

# ముప్కాల్‌లో కొనసాగుతున్న కబడ్డీ శిక్షణ శిబిరం.

**వేగుచుక్క న్యూస్:నిజామాబాద్**



జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముప్కాల్ మండల కేంద్రంలోని భుదేవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 18 నుంచి 24 వరకు అండర్-16 బాలబాలికల కబడ్డీ క్రీడాకారులకు శిక్షణా తరగతులు కొనసాగుతున్నట్లు జిల్లా అధ్యక్షులు అంధ్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి గంగాధర్ రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు ఎంపికైన క్రీడాకారులు నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో నిజామాబాద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఛైర్మన్ సాగర్ రెడ్డి, కొమ్ముల నర్సయ్య, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఛైర్మన్ నునుగొండ అంజయ్య, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సిద్ద రమేష్, పీడీ రాజ్ కుమార్, ప్రసాద్, స్టూడియో శ్రీను, కనకయ్య, ఏలేటి రాజేశ్వర్, దినేష్, ముస్కు శ్రీను, బాల్ రాజు, భీమేష్, సాయిలు, భూపతి, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క

# ఉద్యోగ విరమణ సభలో "ఆదర్శ నిర్ణయం".

**అవయవ దానానికి ముందుకు వచ్చిన ఉపాధ్యాయ దంపతులు.**

**అభినందించిన ఈటెల రాజేందర్, విమలక్క.**

**వేగుచుక్క న్యూస్, రంగారెడ్డి జిల్లా:**





ఉద్యోగ విరమణ సభలో దంపతులు ఆదర్శ నిర్ణయం తీసుకున్నారు. తమ మరణాంతరం అవయవ దానానికి అంగీకారం తెలుపుతూ ప్రమాణ పత్రం అందించారు. ఈ సభకు ముఖ్య అతిథిలుగా హాజరైన ఈటెల రాజేందర్, విమలక్క, డిఇఓ సుశీందర్ రావు అభినందించారు. వివరాల్లోకి వెళితే... సరూర్ నగర్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో గెజిటెడ్ హెడ్ మాస్టర్ గా విధులు నిర్వహిస్తున్న సూర్యపల్లి ఉమాదేవి పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 16 న పదవి విరమణ అభినందన సభ జరుగగా, సూర్యాపల్లి ఉమాదేవి, వారి భర్త ఇంజమూరి రఘునందన్ లు తమ అవయవ దానం చేయాలని నిర్ణయం తీసుకొని, అక్కడే అంగీకార పత్రం అందించారు. మరణానంతరం తమ దేహములు (శరీరములు) వైద్య విద్యార్థుల విద్యాభ్యాసమునకు ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో గాంధీ ఆసుపత్రికి అందచేయాలని నిర్ణయం తీసుకున్నారు.

శరీర దానం చేయడం అనేది మరింతగా ప్రాచుర్యంలోకి రావాలనే ఉద్దేశంతోనే, ఇతరులు కూడా ఆలోచించి ముందుకు వస్తారని ఆశించి ఉద్యోగ విరమణ అభినందన సభలో ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా వారిని ఈటెల రాజేందర్, రంగారెడ్డి డిఇఓ సుశీందర్ రావు, కార్పొరేటర్లు ప్రేమేందర్ రెడ్డి, ఆకుల శ్రీవాణి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభకు హాజరైన ఉపాధ్యాయులు వారిని అభినందించారు. పుట్టిన వాళ్ళు అందరూ ఎప్పుడో ఒకప్పుడు గిట్టే వాళ్ళే, గిట్టిన అనంతరం కూడా మన దేహం, మన అవయవాలు ఇతరులకు ఉపయోగపడితే మన పుట్టుకకు ఒక సార్ధకత ఉంటుంది. వైద్య విజ్ఞానం మరింతగా అభివృద్ధి కావాలి. మానవ శరీర నిర్మాణం గూర్చి వైద్య విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకోవాలంటే వారికి ప్రాక్టికల్స్ గా మనుషుల డెడ్ బాడీలు అవసరం. నేడు మెడికల్ కాలేజీలు డెడ్ బాడీల కొరతను ఎదుర్కొంటున్నవి.

ఫలితంగా వైద్య విద్యార్థులు సమగ్ర వైద్య విజ్ఞానం పొందలేక పోతున్నారు. కాబట్టి మిత్రులారా మనమంతా అవయవ దానం గురించి, శరీర దానం గురించి ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించుటకు కృషి చేద్దామని, శరీర దాతలు ముందుకు వచ్చేలా కృషి చేద్దామని ఈ సందర్భంగా సూర్యపల్లి ఉమాదేవి దంపతులు పిలుపునిచ్చారు.

# సెప్టెంబర్ 30న సెలవు ఇవ్వండి..



తెలంగాణ: ఘనంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగకు ప్రభుత్వ కార్యాలయాలకు సాధారణ సెలవు ప్రకటించాలని కోరింది. టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, కన్వీనర్ ఏలూరి శ్రీనివాస్ రావు ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉద్యోగులకు ఇచ్చిన ఆప్షనల్ హాలిడేను సాధారణ సెలవుగా మార్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు పండుగలో పాల్గొనేందుకు ఈ సెలవు చాలా ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

ఈ తొమ్మిది రోజులు ప్రత్యేకత కలిగినవే. మొదటి రోజున ఎంగిలి పూల బతుకమ్మ, నుండి సద్దుల బతుకమ్మ వరకు ప్రతి రోజూ భిన్నమైన పేర్లు, ఆచారాలు ఉంటాయి. చివరి రోజు జరిగే సద్దుల బతుకమ్మ అత్యంత వైభవంగా జరుగుతుంది. పూలతో అలంకరించిన బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేస్తారు. ఈ వేడుకలో ఉపయోగించే పూలకు ఔషధ గుణాలు ఉండడం వల్ల ప్రకృతి, ఆరోగ్యం రెండింటికీ అనుసంధానం కలుగుతుంది.

పండుగ ప్రాధాన్యం దృష్ట్యా విద్యాసంస్థలు కూడా ప్రత్యేకంగా సెలవులు ప్రకటించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 21 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ దసరా సెలవులు ప్రకటించగా.. జూనియర్ కాలేజీలకు ఈనెల 28 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకూ సెలవులు ఉంటాయి. విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగ ఆనందాన్ని పంచుకోవడానికి వీలవుతుంది. ఇక ప్రభుత్వ ఉద్యోగుల విషయానికొస్తే.. తెలంగాణ జేఏసీ సద్దుల బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు వినతి పత్రం సమర్పించింది. ఇప్పటికే సెప్టెంబర్ 30న ఆప్షనల్ హాలిడే ఇచ్చినా.. దాన్ని సాధారణ సెలవుగా మార్చాలని కోరుతున్నారు. ఎందుకంటే ఈ పూల పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భావిస్తున్నారు. బతుకమ్మ పండుగ ఒక ఆచారం మాత్రమే కాదు.. అది తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక. పూలతో ప్రకృతి పట్ల కృతజ్ఞతను, కుటుంబ బంధాలను బలపరచే ఈ పండుగ తరతరాలకు అందరికీ ఆనందాన్ని పంచుతోంది.

బతుకమ్మ పండుగను అందరూ కలిసి జరుపుకోవాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సంస్కార భారతి తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. ఈ సంబరాలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంస్కార భారతి ప్రతినిధులు హాజరయ్యారు.

# విద్యార్థులు "జీవిత లక్ష్యాలను" నిర్దేశించుకోవాలి.









**ఇంపాక్ట్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షురాలు మాధవి.**

**ఆర్కిడ్స్ స్కూల్ లో ప్రత్యేక ప్రేరణాత్మక తరగతులు.**

**విద్యార్థుల్లో "స్ఫూర్తి" నింపిన "ఇంపాక్ట్" ఫౌండేషన్.**

**పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపల్ అండ్ చైర్మన్ సిహెచ్. గోవర్ధన్, ఆర్కే కాలేజెస్ సీఈఓ జైపాల్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**

విద్యార్థులు "జీవిత లక్ష్యాలను" నిర్దేశించుకోవాలనీ, లక్ష్యాలను స్పష్టంగా పెట్టుకోవడం ద్వారానే వాటిని సాధించవచ్చని ఇంపాక్ట్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షురాలు మాధవి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ "ఆర్కిడ్స్ స్కూల్" లో ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా ప్రత్యేక ప్రేరణాత్మక తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాధవి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే స్ఫూర్తిదాయక ఉపన్యాసాలు అందించింది. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, లక్ష్యాలను స్పష్టంగా పెట్టుకోవడం ద్వారానే వాటిని సాధించవచ్చని ఆమె వివరించారు. గోల్ సెట్టింగ్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ, విద్యార్థులను తమ కలల వైపు సాగేందుకు ప్రేరణ కల్పించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ఆశయాలను బలంగా నమ్మాలని ఆమె ఉద్బోధించారు.

**జాతీయ సలహాదారు రామచంద్రుడు మాట్లాడుతూ,**

సైబర్ భద్రతపై రామ చంద్రుడు విద్యార్థులకు ఫోకస్, సైబర్ సెక్యూరిటీ, కమ్యూనికేషన్ నైపుణ్యాల గురించి వివరించారు. డిజిటల్ యుగంలో సైబర్ భద్రత ఎంత ముఖ్యమో ఆయన విశ్లేషణాత్మకంగా వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించాలని సూచించారు. అలాగే, ప్రభావవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు కెరీర్‌లో ఎలా సహాయపడతాయో వివరించారు. ఈ ప్రోగ్రాం విద్యార్థుల్లో కొత్త స్ఫూర్తిని నింపిందని, ఈ ప్రేరణాత్మక కార్యక్రమం విద్యార్థుల్లో స్ఫూర్తి, దృఢ సంకల్పం పెంపొందించడమే కాకుండా భవిష్యత్తు దిశగా స్పష్టత ఇవ్వడంలో కూడా ఇది ప్రత్యేకమైన పాత్ర పోషించిందని పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్కిడ్స్ స్కూల్ ప్రిన్సిపల్ అండ్ చైర్మన్ సిహెచ్. గోవర్ధన్ రెడ్డి, ఆర్కే కాలేజెస్ సీఈఓ జైపాల్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ సదాశివ రెడ్డి, ఇంపాక్ట్ జాతీయ సలహాదారు నక్క నవీన్, ఆర్కే కాలేజీ డీన్ నవీన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# మహోన్నత శిల్పులు "ఉపాధ్యాయులు".







**దేశ నిర్మాణంలో గురువులది ప్రథమ స్థానం.**

**విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడలపై దృష్టి సారించాలి.**

**టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్.**

**ట్రస్మా ఆధ్వర్యంలో "టీచర్స్ డే" సెలబ్రేషన్స్, బెస్ట్ టీచర్ అవార్డ్స్- 2025.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

తల్లిదండ్రుల తరువాత ఉపాధ్యాయులే విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దే మహోన్నత శిల్పులు అని, భారతీయ సంస్కృతిలో గురువుకు ప్రత్యేక గౌరవం ఉందని, దేశ నిర్మాణంలో వారిది ప్రథమ స్థానం అని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్ లో ట్రస్మా ఆధ్వర్యంలో శుక్రవారం టీచర్స్ డే సెలబ్రేషన్స్, బెస్ట్ టీచర్ అవార్డ్స్-2025 ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ, విద్యార్థులకు జ్ఞానం మాత్రమే కాకుండా విలువలు, నీతి, క్రమశిక్షణ, మానవత్వం గురువుల ద్వారానే విద్యార్థులు నేర్చుకుంటారని గుర్తు చేశారు. చరిత్రలో చాణక్య మార్గదర్శకత్వంతో చంద్రగుప్తుడు మహారాజుగా ఎదిగిన ఉదాహరణను ప్రస్తావించారు. గురువు చూపే మార్గదర్శకతే శిష్యుని సద్గుణవంతుడిగా, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దుతుంది అని మహేష్ గౌడ్ అన్నారు. గత పదేళ్ల పాలనలో విజన్ లేకపోవడం వల్లే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. 7.5 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రం దెబ్బతిన్నదని తెలిపారు. టీచర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, హెల్త్ కార్డు అమలు, స్కిల్ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ మరియు అగ్రికల్చర్ కళాశాలలు వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టుతానని చెప్పారు. అదే సమయంలో విద్యార్థులు చెడు వ్యసనాల నుండి దూరంగా ఉండి, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా అభివృద్ధి, విద్యా ప్రగతికి నా వంతు కృషి కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, ఉర్దూ అకాడమి చైర్మెన్ తాహర్, కార్పొరేషన్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీఈఓ అశోక్, ట్రస్మా జాయింట్ సెక్రటరీ నాయకులు జయసింహా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల కలెక్టర్‌పై ప్రభుత్వం సీరియస్..

**నోటీసులు జారీ.. 3 రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ**



సిరిసిల్ల: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు తాజాగా భారీ షాక్ తగిలింది. ఆయనకు నోటీసులు జారీ చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘించారనే ఆరోపణలో నేపథ్యంలో కలెక్టర్‌కు నోటీసులు జారీ చేయడం తాజాగా సంచలనంగా మారింది. అసలేం జరిగిందంటే.. రెండు రోజుల క్రితం అనగా సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రొటోకాల్ ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చాయి. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి.. కె.రామకృష్ణారావు సందీప్ కుమార్ ఝాకు సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా అధికారికంగా నిర్వహించిన ప్రొటోకాల్ కార్యక్రమంలో సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ.. ఆయన తీరును పలువురు తప్పుపట్టారు. దీనిపై సెప్టెంబర్ 22, సోమవారం మధ్యాహ్నం 3 గంటల లోపు సంజాయిషీ ఇవ్వాలని సీఎస్.. కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకి ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఇచ్చే వివరణను పరిశీలించిన తర్వాత ఆయనపై తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రొటోకాల్ నిబంధనలు ఉల్లంఘించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. అందుకే ఆయనపై చర్యలకు సిద్ధమైంది. అసలేం జరిగిందంటే.. సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉదయం 9.55 గంటలకే జిల్లా కేంద్రంలోని జిల్లా పరేడ్ గ్రౌండ్‌కు వచ్చి జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. ఆ తర్వాత కలెక్టర్ ముఖ్య అతిథిని ఆహ్వానించాలి. ఇక ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ కన్నా ముందే పరేడ్ గ్రౌండ్‌కు వచ్చారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోసం ఎదురు చూశారు. అయితే 10 గంటలు దాటినా కలెక్టర్ రాలేదు. దీంతో శ్రీనివాస్ కలెక్టర్ లేకుండానే జెండా ఆవిష్కరణ చేశారు. పైగా ఈ కార్యక్రమం కోసం కలెక్టర్ సందీప్ ఝా.. అధికారులు, ఇతర సిబ్బందిని సమీకరించలేదు. అలానే ముఖ్య అతిథికి సందేశం అవసరం లేదని కలెక్టర్ చెప్పడంతో.. ఏదో తూతూమంత్రంగా కార్యక్రమాన్ని ముగించారు. అయితే కలెక్టర్ తీరుపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. పైగా ప్రభుత్వం కూడా ఆ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకుంది. అందుకే ఆయనకు నోటీసులు జారీ చేసి.. చర్యలకు ఆదేశించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. కలెక్టర్లు, ఇతర అధికారులు.. ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వకపోయినా.. ప్రొటోకాల్ పాటించకపోయినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తాజాగా హెచ్చరించింది. మరి ఈ నోటీసులపై సందీప్ కుమార్ ఝా ఎలా స్పందిస్తారో చూడాలి.